క్లుప్తంగా

రైతులకు పీఎం కిసాన్ సమ్మాన్ నిధి

కె.కోటపాడు: సాగు పెట్టుబడి సాయం కింద 14వ విడత పీఎం కిసాన్ సమ్మాన్ నిధి రైతులకు ఉపయోగపడనుందని మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ రాజస్థాన్‌లో రైతుల ఖాతాల్లోకి నగదు వేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. గురువారం స్థానిక సచివాలయంలో టీవీ నుంచి మాధవ్ ఈ కార్యక్రమాన్ని వీక్షించారు. ఈ విడతలో రైతుల ఖాతాల్లో రూ.2 వేలు జమకానున్నట్లు ఆయన తెలిపారు.ఏవో సోమశేఖర్, పంచాయతీ కార్యదర్శి వి.ప్రసాద్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మాకవరపాలెం: వెంకన్నపాలెం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం సరఫరా నిలిపివేస్తామని ఏఈ బాలకృష్ణ తెలిపారు. సబ్ స్టేషన్ మరమ్మతులతోపాటు లైన్లపై చెట్ల కొమ్మలను తొలగించే పనులు చేపడుతున్నామన్నారు. ఈ నేపథ్యంలో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు భీమబోయినపాలెం, రామన్నపాలెం పీడర్ల పరిధిలోని జడ్.గంగవరం, ధర్మవరం, జి.వెంకటాపురం, దుంగలవానిపాలెం, శెట్టిపాలెం, రాజుపేట గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండబోదన్నారు.

రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి ఘన సన్మానం



లోవరాజును సన్మానిస్తున్న బార్ సభ్యులు

నర్సీపట్నం: తెలుగు యాదవ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన న్యాయవాది లోకా లోవరాజును గురువారం బార్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయవాదులు వృత్తి పట్ల నిబద్ధతతోపాటు వివిధ రాజకీయ పార్టీలు, కుల సంఘాల్లో చురుకైన పాత్ర వహించాలన్నారు. తన సేవలను గుర్తించి పదవి కట్టబెట్టిన రాష్ట్ర నాయకత్వానికి ధన్యవాదాలు తెలిపారు. బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ ఇటంశెట్టి సూరిబాబు, సీనియర్ న్యాయవాది చింతల ప్రకాష్, మాకిరెడ్డి బుల్లిదొర, కాళ్ల దావీద్ పాల్గొన్నారు.

చిన్నారి వైద్యానికి ఆర్థిక సాయం



బాధిత చిన్నారికి నగదు అందిస్తున్న సభ్యులు

కె.కోటపాడు: చౌడువాడకు చెందిన రొంగలి జోగేష్(5) బ్రెయిన్ సంబంధిత సమస్యతో బాధపడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న స్నేహాంజలి ఫర్ పూర్ ఆర్గనైజేషన్ సభ్యులు చిన్నారికి అండగా నిలవాలని సంకల్పించారు. చిన్నారికి మెరుగైన వైద్యం అందించేందుకు ఆర్గనైజేషన్ సభ్యులు రూ.10 వేలు గురువారం తన కుటుంబ సభ్యులకు అందించారు. సామాజిక సేవా బాధ్యతతో ఈ సాయం చేసినట్టు సంస్థ ప్రతినిధి ద్వారపూడి ఫణీంద్ర, బోగేష్ తెలిపారు.

రక్తహీనత నివారణపై ప్రత్యేక శ్రద్ధ



విద్యార్థినులకు మాత్రలు వేస్తున్న ఎంఈవో

మాకవరపాలెం: రక్తహీనత నివారణపై విద్యార్థులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంఈవోలు లక్ష్మి, మూర్తి సూచించారు. గురువారం స్థానిక కేజీబీవీలో విద్యార్థినులకు ఐరన్ మాత్రలను పంపిణీ చేసి, దగ్గరుండి మింగించారు. ఈ సందర్భంగా రక్తహీనత వల్ల కలిగే అనర్థాలను వివరించారు. పౌష్టికాహారం తీసుకుంటూ వ్యక్తిగత ఆరోగ్యంపై దృష్టి సారించాలన్నారు. హెల్త్ అసిస్టెంట్ శివ, ఎంఎల్‌హెచ్‌పీ ఆశ, ఏఎన్‌ఎం ముత్యాలమ్మ పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుపై దృష్టి

మాకవరపాలెం: రైతులు చిరుధాన్యాల సాగుపై దృష్టి సారించాలని ఏవో చిరంజీవి సూచించారు. ఆయన గురువారం మాట్లాడుతూ రైతులు పంటల మార్పిడిని అలవాటు చేసుకోవాలన్నారు. చిరుధాన్యాల సాగు చేపట్టడం వల్ల ఒకసారి వరి పండించే నీటితో మూడు దఫాలు చిరుధాన్యాల సాగు చేయొచ్చన్నారు. అంతేకాకుండా పంటల మార్పిడి ద్వారా భూసారం పెరిగే అవకాశం ఉందన్నారు. అందుకే రైతులు చిరుధాన్యాల సాగు చేపట్టాలన్నారు.

వరినాట్లకు రంగం సిద్ధం

- కలిసొచ్చిన తుఫాన్ వర్షాలు
- ప్రారంభమైన పొలం దమ్ములు
- 10 వేల ఎకరాల్లో నాట్లు లక్ష్యం
- పెద్దేరు, తారకరామ జలాశయాల్లో పుష్కలంగా నీరు



రోలుగుంటలో దమ్ము పట్టుకుంటున్న రైతులు



పెద్దేరు జలాశయంలో పుష్కలంగా సాగునీరు



వీరనారాయణంలో పెరిగిన వరినారు



ఒమ్మలిలో వరినాట్లు వేయడానికి సిద్ధమైన పొలం

మాడుగుల రూరల్: ఖరీఫ్ వరినాట్లకు రైతులు రంగం సిద్ధమయ్యారు. తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలు కలిసి రావడంతో హుషారుగా దమ్ములు పడుతున్నారు. ఇప్పటికే ఆర్బీకేల ద్వారా పంపిణీ చేసిన వరి విత్తనాలు నారుమడుల్లో వేసిన తర్వాత అడపాదడపా కురిసిన వానలకు నారు ఏపుగా పెరిగింది. పెద్దేరు, తారకరామ, కోనాం జలాశయాల్లో వర్షపు నీరు పుష్కలంగా చేరడంతోపాటు పాలగెడ్డ, ఉరకగెడ్డ పొంగి ప్రవహించడంతో సాగునీటికి ఢోకా లేదని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మండలంలో ఈ ఏడాది ఖరీఫ్ వరి సాధారణ విస్తీర్ణం 10,500 ఎకరాల్లో వరినాట్లు వేయడానికి అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. పెద్దేరు జలాశయం, రాచకట్టు చానల్ కింద ఆయకట్టు భూముల్లో వరినాట్లు ప్రారంభించారు. మెట్ట భూముల్లో రైతులు దమ్ములు పడుతున్నారు. ముందుగా మురగడ దమ్ము పట్టిన వారం రోజులు తర్వాత రెండో సారి దమ్ము చేసి, పట్టితో భూమిని చదునుగా చేసిన తర్వాత వరినాట్లు వెయ్యడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చునని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. పెద్దేరు జలాశయం పరిధి ఒమ్మలి, వి.జె.పురం, జాలంపల్లి, పొన్నవోలు, సత్యవరం, పొంగలిపాక, కింతలి, వల్లాపురం, తదితర గ్రామాల్లో వరినారు పెరిగింది. ప్రస్తుతం మాడుగులలో వరినాట్లు ప్రారంభమయ్యాయి. గతంలో సకాలంలో వరి విత్తనాలు అందక ఆలస్యంగా వరినాట్లు వేసేవారు. ప్రస్తుతం రైతు భరోసా కేంద్రాల ద్వారా ముందుగానే రిజిస్ట్రేషన్ చేయించుకొని విత్తనాలు పంపిణీ చేశారు. దీంతో రైతులు గత నెలాఖరులో వరినారు వేశారు.

దమ్ములు ప్రారంభం

రోలుగుంట: మండల రైతులు దమ్ము పనుల్లో నిమగ్నమయ్యారు. ఇప్పటికే మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని 15 సచివాలయాల్లో రైతులు కోరిన వరి విత్తనాలను పంపిణీ చేశారు. అడపా దడపా కురుస్తున్న వర్షాలకు వరి ఆకు ఏపుగా ఎదగడం, దీనికి తోడు ఈ వారంలో అల్పపీడన ప్రభావంతో కురిసిన వర్షాలకు శరభవరం, రత్నంపేట, బుచ్చింపేట తదితర ప్రాంతాల్లో రైతులు అవకాశమున్న మేర పొలాల్లో నీరు నిలబెట్టుకుని గట్టులు పటిష్టం చేసుకుని గురువారం దమ్ములు చేపట్టారు. దీంతో ట్రాక్టర్లకు, కూలీలకు చేతినిండా పనులు దొరకనున్నాయి.

ఖరీఫ్ కలిసి వస్తుందని ఆశిస్తున్నాం...



ఈ ఏడాది ఖరీఫ్‌కాలం కలిసి వస్తుందని ఆశిస్తున్నాం. ఆర్బీకేల ద్వారా ముందుగానే విత్తనాలు అందాయి. అడపాదడపా కురుస్తున్న వర్షాల వల్ల పొలాల్లో వరినారు ఏపుగా పెరిగింది. జలాశయాలల్లో నీరు పుష్కలంగా ఉంది. నీటిని సైతం విడుదల చేశారు.

– సకలా సూరిబాబు, రైతు, వంటర్లపాలెం గ్రామం

వచ్చే నెలాఖరు కల్లా వరినాట్లు పూర్తి

గతేడాది లక్ష్యాన్ని మించి 11,300 ఎకరాల్లో వరినాట్లు వేశాం. ఇప్పటికే వరినారు ఏపుగా పెరిగింది. ప్రస్తుతం వరినాట్లు ప్రారంభమయ్యాయి. వచ్చే నెలాఖరు కల్లా వరినాట్లు వెయ్యడం పూర్తి కానుంది. పెద్దేరు, తారకరామ జలాశయాలతోపాటు చెరువులు, శారద, తాచేరు, ఉరకగెడ్డ, పాలగెడ్డల్లో నీరు పుష్కలంగా ఉంది.

– ఎం. వాసుదేవరావు, ఏవో, మాడుగుల

పక్కాగా ఖరీఫ్ పంటల నమోదు



సమావేశంలో మాట్లాడుతున్న ఏవో కాంతమ్మ

దేవరాపల్లి: ఖరీఫ్ పంటల నమోదు ప్రక్రియను పారదర్శకంగా చేపట్టాలని ఏవో వై. కాంతమ్మ తెలిపారు. స్థానిక మండల వ్యవసాయ కార్యాలయంలో ఖరీఫ్ పంటల నమోదుపై గ్రామ వ్యవసాయ సహాయలకుతో గురువారం శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పంటల నమోదు సమయంలో రైతులు ఆధార్‌కార్డు, సెల్‌ఫోన్ తీసుకు వచ్చి వ్యవసాయ సహాయకుడికి సహకరించాలని ఆమె సూచించారు. పంటల నమోదుతో రైతు భరోసా పథకం, పంటల బీమా వర్తిస్తుందన్నారు. సున్నా వడ్డీతో పంటల రుణాలకు, ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు ధాన్యం కొనుగోలుకు అర్హత సాధిస్తారన్నారు. పంటల నమోదు ధ్రువీకరణ పత్రాలతో బ్యాంక్‌ల్లో పంట రుణాలు పొందవచ్చునని, ఈ విషయాలను రైతులకు సమగ్రంగా వివరించాని ఏవో ఆదేశించారు. మండల వ్యవసాయ విస్తరణాధికారి ఎస్. కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

జన భాగీ దారి ర్యాలీ



విద్యార్థులతో ర్యాలీ చేస్తున్న ఉపాధ్యాయులు

రోలుగుంట: పీఎంశ్రీ స్కూళ్లలో నిర్వహించే జన భాగీ దారి కార్యక్రమాన్ని స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ప్రసాదరావు ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలసి గ్రామ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమ ఉద్దేశాన్ని ఆయన వివరించారు. ఉపాధ్యాయులు శర్మ, శ్రీరామ్మూర్తి, కిరణ్, నాని, రామశేషు పాల్గొన్నారు.

నారుమడుల శుద్ధితో తెగుళ్ల నివారణ



నీమాస్త్రం, బ్రహ్మాస్త్రం తయారు చేస్తున్న మహిళా రైతులు

నర్సీపట్నం: మండలంలోని వేములపూడిలో ప్రకృతి వ్యవసాయం చేసేందుకు మహిళా రైతులు ముందుకువచ్చారు. నారుమడుల్లో చీడపీడలను కలిగించే పురుగుల నివారణకు నీమాస్త్రం ద్రావణంతో ఎంతో దోహదపడుతుందని ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ వరలక్ష్మి వారికి సూచించారు. రసం పీల్చే పురుగుల నివారణకు ఐదు రకాల ఆకులతో బ్రహ్మాస్త్రం ద్రావణం, పంట బలంగా రావడానికి, తెగుళ్ల నివారణకు, పూత బాగా రావడానికి కోడిగుడ్ల నిమ్మరసం ద్రావణం దోహదపడుతుందన్నారు. నీమాస్త్రం, బ్రహ్మాస్త్రం, కోడిగుడ్ల నిమ్మరసం ద్రావణం తయారు చేయటంపై అవగాహన కల్పించారు.

రోలుగుంట: ప్రాథమికంగా నారుమడుల శుద్ధి ద్వారానే తెగుళ్లు నివారించుకోవచ్చని ప్రకృతి వ్యవసాయ శాఖ మాస్టర్ ట్రైనర్ బి.దేవి తెలిపారు. గురువారం శరభవరంలో నారుమడుల శుద్ధి, ఆకుతీతపై ఆమె రైతు కూలీలకు అవగాహన కల్పించారు. ప్రస్తుతం ఆశించిన పొడ తెగులు నివారణపై వివరించారు. నాట్లు దూరంగా వేయడం వల్ల పంట ఏపుగా ఎదగడంతోపాటు తెగుళ్లు రావన్నారు. ప్రకృతి వ్యవసాయ శాఖ సిబ్బంది సాంబమూర్తి, మోదినాయుడు తదితరులు పాల్గొన్నారు.

బదిలీ ఉద్యోగులకు ఘన సన్మానం



ఎంపీహెచ్‌ఈవోను సన్మానిస్తున్న వైద్య సిబ్బంది

కె.కోటపాడు: వృత్తినే ధర్మంగా భావించి పని చేసే ఉద్యోగులు ప్రజల మన్ననలు పొందుతారని వైద్యాధికారి నిర్మల తెలిపారు. ఇటీవల వైద్య ఆరోగ్య శాఖలో బదిలీల్లో భాగంగా చౌడువాడ పీహెచ్‌సీ నుంచి బదిలీ అయిన ఎంపీహెచ్‌ఈవో కె.వి.రాజశేఖర్, వి.సుబ్బారావు, టి.ఎస్.ఎన్.మూర్తి, కె.నాగమణి, విద్యాభారతి, బి.రాములను వైద్య సిబ్బంది ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందించారు. కోవిడ్ సమయంలో టెస్టింగ్, వ్యాక్సినేషన్ కార్యక్రమాలు సజావుగా నిర్వహించడంలో ఎంపీహెచ్‌ఈవో కె.వి.రాజశేఖర్ పాత్ర ప్రశంసనీయమన్నారు. వైద్యాధికారి సుబ్రహ్మణ్యం, హెల్త్ అసిస్టెంట్ డి.ఎ స్.ఎస్.రాజు పాల్గొన్నారు.

ప్రజా శ్రేయస్సే జగనన్న లక్ష్యం



పీపీ అగ్రహారంలో సర్టిఫికెట్లు అందిస్తున్న నాయకులు, అధికారులు



చాకిపల్లిలో సర్టిఫికెట్లు అందజేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

బుచ్చెయ్యపేట: ప్రజల శ్రేయస్సే సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ధ్యేయమని ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి, పార్టీ మండలాధ్యక్షుడు కె. అచ్చింనాయుడు తెలిపారు. గురువారం జగనన్న సురక్ష గ్రామసభల్లో వీరు పాల్గొన్నారు. ఇందులో భాగంగా కేపీ అగ్రహారంలో 1,108 మందికి, పీపీ అగ్రహారంలో 898 మందికి పలు రకాల సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. సర్పంచ్‌లు ఇందలి కోటేశ్వరరావు, గోపిశెట్టి శ్రీను, పినపోలు రామునాయుడు, ఎంపీటీసీలు గోకివాడ రాము, దేవర అప్పారావు, తహసీల్దార్ వెంకటేశ్వరరావు, ఎంపీడీవో సువర్ణరాజు, సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీ విజయలక్ష్మి, పంచాయతీ సెక్రటరీలు కృష్ణవేణి, రాము పాల్గొన్నారు.

1,332 అర్జీలు పరిష్కారం

చోడవరం: జగనన్న సురక్షలో ఒక్క రోజులోనే 11 రకాల సర్టిఫికెట్లు ప్రజలకు అందిస్తున్నామని తహసీల్దార్ తిరుమలరావు అన్నారు. గురువారం ఆయన చాకిపల్లి సభలో 610 అర్జీలు, లక్కవరం సభలో 722 అర్జీలను పరిష్కరించి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఎంపీడీవో చైతన్య, ఎంపీపీ గాడి కాసు, సర్పంచ్‌లు పోతల జానకీప్రసాద్, శీరంరెడ్డి వెంకటరమణ, మండల పరిషత్ సూపరింటెండెంట్ అమ్మాజి, వైస్ ఎంపీపీ బైన కుమారిఈశ్వరరావు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు

రావికమతం: మండలంలో ఏడు గ్రామ వలంటీర్ పోస్టులకు ఈ నెల 31న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో వెంకన్నబాబు గురువారం తెలిపారు. గత నెల 30వ తేదీ నాటికి 18–35 ఏళ్ల మధ్య ఉన్న వారు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. కొత్తకోట –1, కొత్తకోట–3 సచివాలయ పరిధిలో జనరల్, రెండు బీసీ జనరల్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. తోటకూరపాలెం సచివాలయ పరిధిలో బీసీ జనరల్, టి.అర్జాపురం–2లో ఎస్సీ జనరల్, గుడ్డిప సచివాలయ పరిధిలో రెండు బీసీడీ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

సీఎం జగన్ పాలనతో ఆర్థికాభివృద్ధి



మాట్లాడుతున్న మండల కన్వీనర్ రమణ

దేవరాపల్లి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం ఆర్థికాభివృద్ధి చెందుతుందని జేసీఎస్ మండల కన్వీనర్ కె.వి.రమణ తెలిపారు. గురువారం దేవరాపల్లిలో ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ నాలుగేళ్ల పాలనలో ఎటువంటి సిఫార్సులు లేకుండా రాజకీయాలు, కులమతాలకు అతీతంగా పారదర్శకంగా అందించిన సంక్షేమ పథకాలు పేద, మధ్య తరగతి ప్రజలకు ఎంతో మేలు చేస్తున్నాయన్నారు. సాంకేతిక కారణాలతో సంక్షేమ పథకాలను అందని వారికి జగనన్న సురక్ష కార్యక్రమంతో లబ్ధి చేకూరిందన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన మండల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు కృతజ్ఞతలు తెలియజేశారు.

అటు రాజకీయాల్లో బిజీబిజీ.. ఇటు పొలం పనుల్లో చురుగ్గా..



కూలీలతో వరినాట్లు వేస్తున్న అనురాధ

దేవరాపల్లి: ఆమె డిప్యూటీ సీఎం కుమార్తె.. అటు పార్టీ కార్యక్రమాల్లోనూ, ఇటు అధికారిక కార్యక్రమాల్లోనూ నిత్యం బిజీబిజీగా ఉంటారు. క్షణం తీరిక లేని సమయంలోనూ పొలం పనుల్లో ఉత్సాహంగా పాల్గొని ఆశ్చర్యపరిచారు. మహిళా కూలీలతో పోటీపడి వరినాట్లు వేస్తూ ఉత్సాహపరిచారు. వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు, ఉమ్మడి జిల్లా పరిషత్ స్త్రీశిశు సంక్షేమ శాఖ స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్ ఈర్లె అనురాధ గురువారం తన పుట్టినిల్లు తారువ గ్రామానికి విచ్చేసిన సందర్భంగా ఇలా వరినాట్లు వేస్తూ కనిపించారు. ఇక్కడ తన తండ్రి, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడుకు చెందిన పొలం పనుల్లో ఆమె పాల్గొన్నారు. తాను ఉన్నతి స్థానంలో ఉన్న ప్రజాప్రతినిధి అయినప్పటికీ జానపద పాటలు పాడుతూ నాట్లు వేయడం విశేషం. రైతు కుటుంబానికి చెందిన తనకు కూలీలతో కలిసి ఇలా నాట్లు వేయడం ఎంతో ఆనందాన్ని కలిగిస్తుందని అనురాధ స్పష్టం చేశారు.

గ్రామ స్థాయిలోనే సమస్యల పరిష్కారం



అర్జునగిరిలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం బూడి



సచివాలయ శిలాఫలకం ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం

- గడపగడపలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

చీడికాడ: సచివాలయ వ్యవస్థతో ఇంటి ముంగిటకే సేవలందిస్తున్నామని, అందువల్ల ఏదైనా సమస్య ఉంటే వాటిని గ్రామస్థాయిలోనే పరిష్కరిస్తున్నామని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు తెలిపారు. గురువారం అర్జునగిరిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నాలుగేళ్లలో అందిన సంక్షేమ లబ్ధి గురించి వివరించారు. రూ.1.55 కోట్లతో ఏర్పాటు చేసిన ఇంటింటా కుళాయిల తాగునీరు సరఫరా పరిశీలించారు. అభివృద్ధి పనులకు రూ.10 లక్షల జీజీఎంపీ నిధులు కేటాయించారు. రూ.26.55 లక్షలతో చేపట్టిన నాడు–నేడు పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. రూ.86.50 లక్షలతో నిర్మించిన సచివాలయం, ఆర్బీకే, విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలు ప్రారంభించారు. వైఎస్సార్ యంత్ర సామగ్రిలో భాగంగా రూ.15 లక్షలతో అందించిన ట్రాక్టర్, మూడు పవర్ ట్రిల్లర్లు, రోటవేటర్ ప్రారంభించారు. అంగన్‌వాడీ కేంద్రాలను, ఎంపీపీ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. గర్భిణుల సీమంతాల్లో పాల్గొని ఆశీర్వదించారు. ప్రభుత్వం అందించిన ఇంటి స్థలం కోర్టులో ఉందని పలువురు మహిళలు బూడి దృష్టికి తీసుకురాగా, సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. స్థలం ఉన్న వారికి ఇల్లు నిర్మించుకుంటామంటే మంజూరు చేయాలని ఆదేశించారు. అనంతరం భవన నిర్మాణ ప్రమాదంలో రెండు కాళ్లు విరిగి మంచానికే పరిమితమైన స్కూల్ మాజీ చైర్మన్ పెంటకోట నాగేష్‌ను పరామర్శించారు. సీఎం దృష్టికి తీసుకెళ్లి అండగా నిలుస్తామన్నారు. ఎంపీపీ కురచా జయమ్మనారాయణమూర్తి, జెడ్పీటీసీ లాలం శారదాజానకీరాం, సర్పంచ్‌లు బోడాల రమాదేవి, కసిరెడ్డి సూర్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు, యూత్ అధ్యక్షుడు స్వామినాయుడు, నాయకులు పెంటకోట నూకునాయుడు, చుక్కా అప్పలనాయుడు, పరవాడ నాయుడు, కోవిలపల్లి పైడిబాబు, మోసూరి సింహాచలంనాయుడు, తంగేటి అప్పలనాయుడు, అద్దెపల్లి నర్సింహామూర్తి, తహసీల్దార్ బి.వి.రాణి, ఎంపీడీవో జయప్రకాష్ పాల్గొన్నారు.

ప్రజల ముంగిటకే సంక్షేమ పాలన

- 'గడపగడపకు' కార్యక్రమంలో ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్



ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: ప్రజల ముంగిటకే సంక్షేమ పాలనను తీసుకొచ్చిన ఘనత సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అన్నారు. గురువారం మున్సిపాలిటీ 22వ వార్డు వెంకునాయుడుపేటలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ఇంటింటికీ వెళ్లి ఎమ్మెల్యే ఆరాతీశారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వార్డు ప్రజలు తీసుకువచ్చిన సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ప్రభుత్వం అర్హతే ప్రామాణికంగా పథకాలు అందిస్తోందన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థలతో సంక్షేమం నేరుగా లబ్ధిదారుల ఇళ్ల వద్దకే చేరుతుందన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, మున్సిపల్ కమిషనర్ కనకారావు, వార్డు నాయకులు పెట్ల అప్పలనాయుడు, కర్రి రాంగోపాల్, టౌన్ పార్టీ అధ్యక్షుడు ఏకా శివ, కౌన్సిలర్లు వీరమాచినేని జగదీశ్వరి, సిరసపల్లి నాని, ముస్లిం కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ ఉన్నీషా బేగం, అయ్యారక కార్పొరేషన్ డైరెక్టర్లు కర్రి కనకమహాలక్ష్మి, కర్రి శ్రీనివాసరావు, టౌన్ మహిళా విభాగం అధ్యక్షురాలు బయపురెడ్డి గణమ్మ, మున్సిపల్ సచివాలయాల కన్వీనర్ తమరాన శ్రీనివాసరావు, కోఆప్షన్ సభ్యురాలు షేక్ రోజా, ఏఎంసీ వైస్ చైర్మన్ మళ్ల గణేష్, వివిధ దేవస్థానాల చైర్మన్లు ధనిమిరెడ్డి నాగు, సిహెచ్.సతీష్, పార్టీ నాయకులు గుడబండి నాగేశ్వరరావు, యాదగిరి శేషు, కోనేటి శ్రీను, శ్రీకాంత్, కణితి అన్నపూర్ణ, గంటా లలిత, లోవరపు శారద పాల్గొన్నారు.

ఓటరు సర్వే ఆకస్మిక తనిఖీ



మాడుగులలో బీఎల్వోలతో మాట్లాడుతున్న ఆర్వో అనిత



పాపయ్యపాలెం సర్వే చేస్తున్న బీఎల్‌వో రత్నకుమార్

మాడుగుల: ఇంటింటికీ తిరిగి ఓటరు నమోదు జాబితాలు సరి చేయాలని ఎలక్షన్ రిటర్నింగ్ అధికారి ఎస్.డి. అనిత బీఎల్వోలను ఆదేశించారు. గురువారం మాడుగుల పట్టణంలో ఓటరు సర్వేను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇంటి నంబర్ల తప్పులు ఉన్నవారికి సరి చేయాలని సూచించారు. తహసీల్దార్ పీవీరత్నం, డీటీ సత్యనారాయణ, ఎలక్షన్ సీనియర్ అసిస్టెంట్ పూర్ణ పాల్గొన్నారు.

ఓటరు సర్వే పరిశీలన

కె.కోటపాడు: ఇంటింటా ఓటరు సర్వేను బీఎల్వోలు పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని తహసీల్దార్ జె.రమేష్‌బాబు తెలిపారు. ఎ.భీమవరంలో బూత్ నంబర్ 197లో ఓటరు సర్వేను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బీఎల్వోలు ఇంటింటికీ వెళ్లి సర్వే చేస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు.

ముమ్మరంగా ఓటర్ల సర్వే

మాకవరపాలెం: ఓటర్ల సర్వే గ్రామాల్లో ముమ్మరంగా సాగుతోంది. మండలంలోని 31 పంచాయతీల్లోని పోలింగ్ బూత్‌ల పరిధిలో బీఎల్వోలంతా ఇంటింటి సర్వే చేస్తున్నారు. ఓటర్ల జాబితాలను పట్టుకుని వాటి ఆధారంగా ఓటు హక్కు ఉన్న వారంతా స్థానికంగా ఉన్నారా ? లేదా, మరణించిన వారు, శాశ్వతంగా గ్రామాలు విడిచి వెళ్లిన వారి వివరాలను సేకరిస్తున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ప్రసాద్ మాట్లాడుతూ పక్కాగా ఓటర్ల సర్వే చేపట్టాలని ఆదేశించారు.

అధిక ధరకు మొక్కల విక్రయంపై విచారణ



విచారణ చేస్తున్న ఏరియా కోఆర్డినేటర్ రాజేశ్వరి

కె.కోటపాడు: ఇటీవల వెలుగు ద్వారా చౌడువాడలో డ్వాక్రా సంఘాలకు అధిక ధరకు పండ్ల మొక్కలను విక్రయించినట్టు మండల పరిషత్ సమావేశంలో ఎంపీటీసీ, సర్పంచ్‌లు ఆరోపించారు. దీనిపై పత్రికల్లో వచ్చిన వార్తల నేపథ్యంలో గురువారం డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి ఆదేశాల మేరకు పెందుర్తి ఏరియా కోఆర్డినేటర్ రాజేశ్వరి చౌడువాడలో వీవోఏలు వెంకటలక్ష్మి, వరలక్ష్మి, శాంతిలను విచారణ చేపట్టారు. ఇటీవల కె.కోటపాడుకు వచ్చిన కొబ్బరి, మామిడి, నిమ్మ, సపోటా, జామ, బొప్పాయి, తదితర 275 మొక్కలను తమ సొంత నగదుతో గ్రామానికి తీసుకువచ్చి డ్వాక్రా మహిళలకు విక్రయించామన్నారు. ఇంకా వారి నుంచి నగదు రాలేదన్నారు. వీటి కొనుగోలుకు నిర్దేశించిన మొత్తాన్ని చెల్లించినట్లు డ్వాక్రా సభ్యులు భీశెట్టి లక్ష్మి, శరగడం వరలక్ష్మి, ఎస్.నాగమణి వివరించారు. ఈ వివరాలను లిఖిత పూర్వకంగా పీడీకి నివేదిస్తానని కోఆర్డినేటర్ తెలిపారు. ఏపీఎం వెంకటలక్ష్మి, సీసీ సూర్యనారాయణ పాల్గొన్నారు.